క్లుప్తంగా

కమిషనర్ హేమమాలిని బాధ్యతల స్వీకారం


హేమమాలిని

నందిగామ: పట్టణ మున్సిపల్ కమిషనర్‌గా హేమమాలిని సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం నంద్యాల జిల్లా డోన్ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీకాగా, ఆస్థానంలో మంగళగిరి–తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్‌గా పనిచేస్తున్న హేమమాలిని బదిలీపై ఇక్కడికి వచ్చారు. కమిషనర్‌ను పట్టణ పరిధిలోని సచివాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు.

ముక్త్యాల ఆలయానికి రూ.4.99లక్షల ఆదాయం

ముక్త్యాల(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న భవానీ ముక్తేశ్వరస్వామి వారికి భక్తులు సమర్పించిన హుండీ కానుకల ద్వారా రూ.2.17లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవో జయప్రకాష్‌బాబు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో సోమవారం హుండీ లెక్కింపు కార్యక్రమంలో గ్రూప్ టెంపుల్స్ ఈవో వైష్ణవి, సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా మహాశివరాత్రి సందర్భంగా లడ్డు విక్రయం, కొబ్బరిచిప్పలు పోగుచేసుకునే హక్కుల బహిరంగ వేలం ద్వారా ఆలయానికి రూ.2.82లక్షల ఆదాయం వచ్చిందని ఈవో జయప్రకాష్‌బాబు వివరించారు.

నిత్యాన్నదానానికి విరాళం



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి సోమవారం పల్నాడు జిల్లా నకిరికల్లుకి చెందిన రేలంగి ఊర్మిల వారి కుమార్తె విజయలక్ష్మి పేరు మీద రూ.10,116లు విరాళంగా అందజేశారు. ఆలయ పాలకమండలి డైరెక్టర్ బెజవాడ శ్రీనివాసరావు చేతుల మీదుగా ఆలయ అధికారులకు విరాళాన్ని అందజేశారు. ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

ప్రధానార్చకుడిగా గోపిబాబు



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయ ప్రధానార్చకుడిగా మర్రిబోయిన గోపిబాబు నియమితులయ్యారు. ఈ మేరకు ఈవో కె.రమేష్‌నాయుడు తన కార్యాలయంలో సోమవారం గోపిబాబుకు నియామకపత్రం అందజేశారు. గతంలో పనిచేసిన ప్రధానార్చకుడు మర్రిబోయిన వెంకటరమణ మృతిచెందడంతో అతని స్థానంలో ఆలయంలోని ఉప ప్రధానార్చకుల్లో సీనియరైన గోపిబాబును నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు. ఏఈవో ఉమాపతి, సూపరింటెండెంట్ ఎల్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గిరిప్రదక్షిణ రోడ్డు పనుల పరిశీలన



తిరుమలగిరి(జగ్గయ్యపేట అర్బన్): తిరుమలగిరి నామాల శ్రీవెంకటేశ్వరస్వామి వారి కొండ చుట్టూత చేపట్టిన గిరి ప్రదక్షిణ రోడ్డు నిర్మాణ పనులను ఆలయ చైర్మన్ కొమరగిరి భరద్వాజ్ సోమవారం పరిశీలించారు. భరద్వాజ్ మాట్లాడుతూ ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను ప్రత్యేక కృషితో రూ.70లక్షలతో కొండ చుట్టూత గిరిప్రదక్షిణ కోసం నూతనంగా సీసీరోడ్డు నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. దేవస్థాన పాలకమండలి సభ్యులు చింతల నరసింహారావు, లింగగిరి రాంబాబు, తిరుమలగిరి సచివాలయం కన్వీనర్ మెట్టు ఏడుకొండలు, జాగు జనార్దన్ పాల్గొన్నారు.


క్రికెట్ కిట్ల పంపిణీ

నరసింహారావుపాలెం(వీరులపాడు): మండలంలోని నరసింహారావుపాలెం గ్రామానికి చెందిన పచ్చల వెంకట్రామయ్య 25వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన తనయుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు పచ్చల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం మండలస్థాయి క్రికెట్‌పోటీలు నిర్వహించారు. నందిగామ రూరల్ సీఐ చంద్రశేఖరరావు హాజరై క్రీడాకారులకు క్రికెట్ కిట్లను అందజేశారు. సర్పంచి బొమ్మిశెట్టి దుర్గాదేవి, ఏఎంసీ మాజీ చైర్మన్ బొమ్మినేని భాస్కరరావు, ఎంపీటీసీ సభ్యుడు శీలం రమణారెడ్డి, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

గోపినేనిపాలెం(వత్సవాయి): స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం పిన్నమనేని సిద్దార్థ వైద్యశాల, కొమరగిరి ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తిరుమలగిరి ఆలయ చైర్మన్ కొమరగిరి భరద్వాజ్ సోమవారం తెలిపారు. వైద్యపరీక్షలకు హాజరయ్యేవారు తప్పకుండా ఆధార్‌కార్డును వెంట తీసుకురావాలని సూచించారు.

నూరుశాతం ఉత్తీర్ణతపై గురి


పెనుగంచిప్రోలు కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో రివిజన్ టెస్ట్ రాస్తున్న విద్యార్థులు


ప్రభుత్వం అందించిన స్టడీమెటీరియల్‌ను చూపుతున్న పదోతరగతి విద్యార్థులతో ఉపాధ్యాయులు, నాయకులు

- పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు..
- స్టడీమెటీరియల్ పంపిణీ
- రోజూ పరీక్షల నిర్వహణ

పెనుగంచిప్రోలు: విద్యార్థి జీవితంలో పదోతరగతి ఎంతో కీలకం. పది పరీక్షల్లో సాధించిన మార్కులే ఏవిద్యార్థి ఉన్నత విద్యకైనా తొలిమెట్టు. దీనిని దృష్టిలో పెట్టుకుని పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యాశాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను ప్రణాళికాబద్ధంగా చదివిస్తున్నారు. ఈఏడాది మార్చి 18నుంచి 30వతేదీ వరకు పదోతరగతి పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేసే కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో భాగంగా రోజూ సాయంత్రం మూడు గంటల నుంచి గం.5.30 నిముషాల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. సెలవు రోజుల్లో కూడా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. రెండు గంటలు చదివిన తరువాత ప్రతిరోజూ ఆయా సబ్జెక్టుల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ....

పదోతరగతి విద్యార్థులు సులువుగా పరీక్షలకు ప్రిపేర్ అయ్యేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం స్ఫూర్తి స్టడీమెటీరియల్ అందజేసింది. జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో ఇప్పటికే విద్యార్థులందరికీ స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారు.

23నుంచి ప్రీ ఫైనల్ పరీక్షలు..

ఈ ఏడాది జగ్గయ్యపేట నియోజకవర్గంలోని 53 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో కలిపి మొత్తం 2790మంది విద్యార్థులు పదోతరగతి పబ్లిక్ పరీక్షలు హాజరుకానున్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ముందుగా మాక్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. మంగళవారం నుంచి ఫార్మెటివ్–3 పరీక్షలు జరగనున్నాయి. ఫిబ్రవరి 23 నుంచి ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహించనున్నారు.

అవగాహన కల్పించాం..



పరీక్షా విధానంలో ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులపై విద్యార్థులకు ఇప్పటికే అవగాహన కల్పించాం. గతంలో ఒక్కో సబ్జెక్టుకు రెండు పరీక్షలు జరిగేవి. ఇప్పుడు మొత్తంగా ఏడు పరీక్షలు రాయాల్సి ఉంటుంది. గ్రేడ్‌ల వారీగా విద్యార్థులను విభజించి శిక్షణ ఇస్తున్నాం. ఉపాధ్యాయులు కూడా ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నారు.

–కె.జలజ, హెచ్ఎం, కేవీఆర్ జెడ్పీ హైస్కూల్

విద్యార్థులపై ప్రత్యేకశ్రద్ధ..



పదోతరగతి పరీక్షల్లో విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాం. విద్యార్థులందరినీ ప్రణాళికాబద్ధంగా చదివిస్తున్నాం. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణా తరగతులు ఏర్పాటు చేశాం. పబ్లిక్ పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పనిచేస్తున్నాం.

–డి రవీంద్ర, పెనుగంచిప్రోలు ఎంఈవో

మహానేత వైఎస్సార్ విగ్రహం ఆవిష్కరణ


వైఎస్సార్ విగ్రహావిష్కరణ అనంతరం మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, పక్కన ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్, గాదెల వెంకటేశ్వరరావు, కొమ్మినేని రవిశంకర్ తదితరులు

నందిగామ: మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయాల సాధన కోసం ఆయన తనయుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషిచేస్తున్నారని ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను అన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలోని ఏటిపట్టు గ్రామమైన నందిగామ మండలం గోళ్ళమూడిలో ఏర్పాటు చేసిన మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్‌తో కలిసి సోమవారం రాత్రి ఆయన ఆవిష్కరించారు. అనంతరం విప్ ఉదయభాను, ఎమ్మెల్సీ అరుణకుమార్ మాట్లాడుతూ మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తరహాలోనే రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగుతోందన్నారు. రాష్ట్రం మరింత అభివృద్ధి బాటలో పయనించాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని పేర్కొన్నారు. అనంతరం గ్రామానికి చెందిన పలువురు వైఎస్సార్ సీపీలో చేరగా, నాయకులు వారికి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గాదెల వెంకటేశ్వరరావు, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్, నాయకులు కొల్లూరు ఉమామహేశ్వరరావు , రమేష్, కనగాల వెంకటేశ్వరరావు, దేవినేని రామారావు, ఏటిపట్టు గ్రామాలకు చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

స్పందనకు 13 అర్జీలు



నందిగామ: ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ పి.సాయిబాబు సూచించారు. తన కార్యాలయంలో సోమవారం ఆయన స్పందన కార్యక్రమం నిర్వహించగా, ఆయా సమస్యల పరిష్కారం కోరతూ 13మంది అర్జీలు అందజేశారు. ఈసందర్భంగా ఆర్డీఓ సాయిబాబు మాట్లాడుతూ రెవెన్యూ సంబంధిత సమస్యలపై 11 అర్జీలు, వెలుగు ప్రాజెక్టు, ఆర్డీసీకి సంబంధించి ఒక్కో అర్జీ అందినట్లు తెలిపారు. ఆయా అర్జీలను సంబంధిత అధికారులకు పంపి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని వివరించారు.

98.79శాతం పింఛన్ల పంపిణీ



పెనుగంచిప్రోలు: మండలంలో సామాజిక పింఛన్ల పంపిణీ 98.79 శాతం పూర్తయినట్లు ఎంపీడీవో సాయిహర్ష సోమవారం తెలిపారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది తెల్లవారుజాము నుంచే పింఛన్ల పంపిణీలో పాల్గొంటున్నారన్నారు పెనుగంచిప్రోలుకు చెందిన వలంటీర్ చింతమాల గోపి సుమారు 150 కిలోమీటర్ల దూరంలో సత్తెనపల్లిలో చికిత్సపొందుతూ బంధువుల ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న ఏనుగుదాటి మంగమ్మ వద్దకు వెళ్లి వృద్ధాప్య పింఛన్ అందించారు. మంగమ్మ కుటుంబసభ్యులతోపాటు గ్రామస్తులు వలంటీర్ గోపిని అభినందించారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛను పంపిణీ..

జగ్గయ్యపేట: గ్రామానికి చెందిన ఉలవలపూడి గాంధీ అనారోగ్యంతో బాధపడుతూ విజయవాడలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ ఆదూరి పరిమలత సోమవారం విజయవాడ వెళ్లి లబ్ధిదారునికి పింఛన్ అందించింది. దీంతో గాంధీ కుటుంబసభ్యులు వలంటీర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.


కొనసాగుతున్న పైపులైన్ మరమ్మతులు

- నీటిసరఫరాకు అంతరాయం
- ట్యాంకర్ల ద్వారా నీటిసరఫరాకు చర్యలు


హెడ్ వాటర్ వర్క్స్ వద్ద పైపులైన్ మరమ్మతు పనులను పర్యవేక్షిస్తున్న తుమ్మల ప్రభాకర్, ఏఈ


జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణ ప్రజలకు మంచినీరు అందించే హెడ్‌వాటర్ వర్క్స్ వద్ద ప్రధాన పైపులైన్‌కు లీకేజీలు ఏర్పడటంతో నీటిసరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ఆదేశాల మేరకు మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ సోమవారం ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బందితో కలసి యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ 40 ఏళ్ల క్రితం నాటి ప్రధాన పైపులైన్ కావడంతో లీకేజీకి గురై నీటిసరఫరాకు అంతరాయం ఏర్పడిందని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ యానాదుల కాలనీ, ఎన్జీవో కాలనీ, రావూస్ స్కూల్ ఏరియా, ఇండోర్ స్టేడియం, గౌతమి స్కూల్, విజేత స్కూల్, వైవై కాలనీ, ఆర్టీవో ఆఫీస్ రోడ్, కాకానినగర్, సీతారామపురం, ఆర్టీసీ డిపో ఏరియా, గరల్స్ హైస్కూల్ ఏరియా, మిట్టగూడెం, డంగుమిల్లు ఏరియా, క్రిస్టియన్‌పేట, కొలిమి బజారు, క్రిస్టియన్‌పేట సీఎస్ఐ చర్చి ఏరియా, ఎర్రకాలువ, రంగుబజారు, సత్యనారాయణపురం, డీవీఆర్ నగర్, శాంతినగర్, సిద్ధార్థ నగర్, విష్ణుప్రియనగర్ ప్రాంతాలకు నాలుగురోజులపాటు నీటిసరఫరా నిలిచిపోతుందని వివరించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా 10 ట్యాంకర్ల ద్వారా ఆయా ప్రాంతాలకు నీటిసరఫరా చేస్తామని తెలిపారు. ట్యాంకర్ల ద్వారా నీటిసరఫరాను ఆయా సచివాలయాల్లోని ఎమినిటీ సెక్రటరీలు పర్యవేక్షిస్తారని వివరించారు. మున్సిపల్ ఏఈ హనుమంతరావు పాల్గొన్నారు.

గొట్టుముక్కల సొసైటీ అధ్యక్షుడిగా 'ఆలోకం'


బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆలోకం శ్రీనివాసరావును అభినందిస్తున్న నాయకులు

కంచికచర్ల : మండలంలోని గొట్టుముక్కల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ అధ్యక్షుడుగా ఆలోకం శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. నందిగామ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ చేతుల మీదుగా ఈ మేరకు నియామకపత్రాన్ని అందుకుని బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా అలోకం శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతుసంక్షేమానికి కృషిచేస్తానని తెలిపారు. తనకు సొసైటీ చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ గుదే అక్కారావు, తంగెళ్లమూడి రామారావు, బండ్లమూడి శ్రీనివాసరావు, శివాలయ, వసంత వేణుగోపాలస్వామి ఆలయాల చైర్మన్లు ఆలోకం శ్రీనివాసరావు, యర్రగుంట శ్రీనివాసరావు, త్రీమెన్ కమిటీ సభ్యులు కూచిపూడి వెంకయ్య, బొజ్జా వెంకట్రావు, నాయకులు యనమండల వెంకటేశ్వరరావు, కుంటముక్కల వసంతరావు, నెట్టెం వెంకయ్య, షేక్ సుభాని, బండిబోయిన ఏడుకొండలు, ములకలపల్లి శేషగిరిరావు, దమ్మాలపాటి శ్రీనివాసరావు, యర్రకుంటు జగ్గయ్య, కార్యదర్శి ముప్పాళ్ల వెంకటేశ్వరరావు, షేక్ బాషా పాల్గొని సొసైటీ చైర్మన్ ఆలోకం శ్రీనివాసరావుకు అభినందనలు తెలియజేశారు.

మోడల్ టెస్ట్‌కు 700 మంది హాజరు



జగ్గయ్యపేట అర్బన్: ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు నిర్వహించిన మోడల్ పరీక్షకు విశేష స్పందన లభించింది. స్థానిక జేఆర్సీ జూనియర్ కళాశాలలో నిర్వహించిన పరీక్ష పేపర్‌ను జేఆర్సీ విద్యా సంస్థల చైర్మన్, డైరెక్టర్ ఆర్.మణికంఠ, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ పెనుగొండ వెంకట్రావు, యూటీఎఫ్ జిల్లా నాయకులు ఎం.కృష్ణయ్య, ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం.సోమేశ్వరరావు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం.సోమేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు కమల్‌కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు పర్యవేక్షణలో జరుగుతున్న ఈ ప్రజ్ఞ వికాసం మోడల్ పరీక్షకు జగ్గయ్యపేట మండలంలో ఆయా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 700 మంది విద్యార్థులు హాజరయ్యారని వివరించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు, విశ్వభారతి డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి జగనన్న కృషి

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

పెండ్యాల(కంచికచర్ల) : అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడం ద్వారా పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విశేషంగా కృషిచేస్తున్నారని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్ రావు పేర్కొన్నారు. మండలంలోని పెండ్యాల గ్రామంలో సోమవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గ్రామస్తులను ఆప్యాయంగా పలకరించారు. వారి యోగక్షేమాలతోపాటు ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును అడిగితెలుసుకున్నారు. గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను తనదృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే వారికి సూచించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జగన్ మోహనరావు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను రాజకీయాలకతీతంగా అమలు చేస్తూ, అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ లబ్ధి చేకూర్చుతున్న ఘనత తమ వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అన్ని వర్గాల సంతోషం, సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ, ఆర్బీకే సెంటర్లు, నాడు–నేడు, లక్షల సంఖ్యలో ఇళ్ల పట్టాల పంపిణీ, వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం, జగనన్న మోడల్ కాలనీలు, అమ్మఒడి, విద్యా దీవెన తదితర పథకాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తూ పేదలకు అండగా ఉంటున్నారని కొనియాడారు. ఇలా పేదల అభ్యున్నతికి కృషిచేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలంటూ ప్రజలంతా ఆశీర్వదిస్తుండటమే ఆయన సుపరిపాలన అందిస్తున్నారడానికి నిదర్శనమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, ఎంపీటీసీ సభ్యుడు షేక్ బడేహజరత్, వేములపల్లి సొసైటీ అధ్యక్షుడు కోదాటి రామకృష్ణ, మాజీ సర్పంచి షేక్ ఖాజాపాషా, నాయకులు షేక్ పీర్‌సామియా, షేక్ చాన్‌బహదూర్, నిస్సార్‌పాషా, కార్యదర్శి వనిత, వీఆర్వో బ్రహ్మం, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.


పెండ్యాలలో ప్రభుత్వ పథకాల క్యాలెండర్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహన్‌రావు

తహసీల్దార్ల బాధ్యతల స్వీకారం


అమ్మాజీ


సుస్వాగతం


సరస్వతి


తహసీల్దార్ రాజకిషోర్‌ను సత్కరిస్తున్న నాయకులు

పెనుగంచిప్రోలు: మండల తహసీల్దార్‌గా వి.అమ్మాజీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న కె.లక్ష్మీకల్యాణి పశ్చిమగోదావరి జిల్లా పెనుమత్ర మండలానికి బదిలీకాగా ఆమె స్థానంలో తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం నుంచి అమ్మాజీ బదిలీపై ఇక్కడికి వచ్చారు.

కంచికచర్ల తహసీల్దార్‌గా సుస్వాగతం..

కంచికచర్ల : మండల తహసీల్దార్‌గా వి.సుస్వాగతం సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న పి.శంకరబాబు విజయవాడకు బదిలీకాగా, ఆస్థానంలో రాజమండ్రి నుంచి సుస్వాగతం బదిలీపై ఇక్కడికి వచ్చి బాధ్యతలు స్వీకరించారు. నూతన తహసీల్దార్ సుస్వాగతంను డీటీ షేక్ నాగుల్‌మీరా, రెవెన్యూ సిబ్బంది కలిసి అభినందనలు తెలియజేశారు.

నందిగామ తహశీల్దార్‌గా సరస్వతి..

నందిగామ: మండల తహసీల్దార్‌గా వై.సరస్వతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న నరసింహారావు తూర్పుగోదావరి జిల్లా ప్రత్తిపాడు బదిలీ కాగా, స్థానంలో తూర్పుగోదావరి జిల్లా అనపర్తి తహసీల్దార్‌గా పనిచేస్తున్న సరస్వతి బదిలీపై ఇక్కడికి వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం తహశీల్దార్ సరస్వతి, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు.

బాధ్యతలు స్వీకరించిన రాజకిషోర్..

వీరులపాడు: మండల తహసీల్దార్‌గా రాజకిషోర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ ఆశయ్యానాయక్ కాకినాడకు బదిలీకాగా, ఆస్థానంలో నందిగామ ఆర్డీవో కార్యాలయం నుంచి రాజకిషోర్ ఇక్కడికి వచ్చారు. ఈసందర్భంగా తహసీల్దార్ రాజకిషోర్ మాట్లాడుతూ రైతులు తమ సమస్యలను నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన రాజకిషోర్‌ను పీఏసీఎస్ చైర్మన్ పూలా రాంబాబు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు రమావత్ రాము, డిప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు, ఆర్ఐ శివప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ మాడుగుల అంకమ్మరావు, జూనియర్ అసిస్టెంట్ సునంద తదితరులు కలిసి సత్కరించి అభినందనలు తెలియజేశారు.

విధుల్లో చేరిన నూతన ఎస్ఐలు


పద్మారావు


సతీష్


ధర్మరాజు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణ నూతన ఎస్ఐగా ఎ.పద్మారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు పట్టణ ఎస్ఐగా పనిచేసిన ఆనందకుమార్ తూర్పుగోదావరి జిల్లాకు బదిలీ కాగా, ఆస్థానంలో తిరువూరు నుంచి ఎ.పద్మారావు బదిలీపై ఇక్కడికు వచ్చారు.

చిల్లకల్లు ఎస్ఐగా వి.సతీష్..

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట రూరల్ పోలీస్‌స్టేషన్ చిల్లకల్లు ఎస్ఐగా వి.సతీష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు పనిచేసిన కృష్ణబాబు విజయవాడలోని గవర్నర్‌పేట స్టేషన్‌కు బదిలీ కాగా, ఆస్థానంలో తిరువూరు నుంచి సతీష్ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఎస్ఐ సతీష్ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు సమర్థవంతంగా కృషిచేస్తానని తెలిపారు.

చందర్లపాడు ఎస్ఐగా ధర్మరాజు

చందర్లపాడు(నందిగామ): చందర్లపాడు ఎస్ఐగా ఆర్.ధర్మరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ రామకృష్ణ బదిలీకాగా, ఆస్థానంలో ఇబ్రహీంపట్నం నుంచి ధర్మరాజు బదిలీపై ఇక్కడికి వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్ఐ ధర్మరాజు నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్‌రావు, ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఘనంగా ఆరాధన మహోత్సవాలు



నందిగామ: త్యాగరాజస్వామి వారి 15వ ఆరాధన మహోత్సవాలను నందిగామ పట్టణంలో సోమవారం వైభవంగా నిర్వహించారు. త్యాగరాజస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం త్యాగరాజస్వామి వారి చిత్రపటాన్ని మేళతాళాలతో పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం ముక్కోటి మండపంలో కళాకారులచే నాదస్వర కచేరీ నిర్వహించారు.